క్లుప్తంగా

గురజాడ సేవలు మరువలేనివి


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్

చిత్తూరు కలెక్టరేట్: గురజాడ అప్పారావు సేవలు మరువలేనివని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. ఆ కళాశాలలో తెలుగు శాఖా విభాగం ప్రొఫెసర్ ఉషారాణి ఆధ్వర్యంలో గురువారం గురజాడ అప్పారావు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

టేక్ హోమ్ రేషన్ తేదీల్లో మార్పు

ఐరాల: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న టేక్ హోమ్ రేషన్ తేదీల్లో కొన్ని మార్పులు చేసినట్లు సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథక అధికారిణి నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్‌లో 2వ శుక్రవారం 8వ తేదీ, 4వ శుక్రవారం 22వ తేదీ అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేయనున్నట్లు వివరించారు. లబ్ధిదారులు గమనించాలని కోరారు.

మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి


మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

గుడిపాల: సమాజంలో ప్రతి వ్యక్తి మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని ఇందిరా క్రాంతి ఏపీయం సుధారాణి, వెలుగు సీసీ హేమచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని 189 కొత్తపల్లిలో గురువారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్త్రీ హింస నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం బాల్య వివాహాలు, ఆడ, మగ సమానత్వం, కుటుంబ హింసపై అవగాహన కల్పించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ


తులసీరాంకు సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు


యాదమరి: మండలంలోని పెరుమాళ్లపల్లెకు చెందిన తులసీరాంకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1.40లక్షలు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గురువారం అందించారు. తులసీరాం కుటుంబంలో భార్యాబిడ్డలు అగ్ని ప్రమాదంలో మృతి చెందడంతో వారికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1.40 లక్షలు మంజూరు కావడంతో ఉదయం ఎమ్మెల్యే కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి ఉన్నారు.

హక్కులను తెలుసుకోవాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ మునస్వామి

యాదమరి: గ్రామాల్లో నివసించే గ్రామీణులు తమ హక్కులను తెలుసుకోవాలని ఎస్‌ఐ మునస్వామి కోరారు. మండలంలోని 14 కండ్రిగ దళితవాడలో గురువారం మానవహక్కులపై గ్రామీణులకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలు వచ్చినా నేరుగా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో పర్యటించిన 100కు ఫోన్ చేయాలని కోరారు. తహసీల్దార్ హనుమంతు మాట్లాడుతూ భూముల వద్ద సమస్యలు వస్తే మధ్యవర్తులతో కాకుండా నేరుగా వచ్చి మాట్లాడి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివరాజ్, దళిత నాయకులు మురుగేష్ పాల్గొన్నారు.

మహోన్నతుడు భక్త కనకదాసు


కనకదాసుకు నివాళులర్పిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: భక్తకనకదాసు మహోన్నతుడు అని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కవి భక్త కనకదాసు జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ షణ్మోహన్ పాల్గొని కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కురబ కార్పొరేషన్ డైరెక్టర్ అమరనాథ్, డీఆర్‌ఓ రాజశేఖర్, బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలేయం.. జర భద్రం

- ఫాటీ లివర్‌ను అశ్రద్ధ చేయొద్దు
- పెరుగుతున్న లివర్ సిర్రోసిస్ కేసులు
- ఏడాదికోసారి పరీక్షలు తప్పనిసరి

కాలేయం..మనిషి శరీరంలో అతి ముఖ్యమైన అవయవం. జీర్ణవ్యవస్థలో కీలకం.. శరీరానికి అవసరమైన రసాయనాలను తయారు చేసి, సరఫరా చేసే ప్రయోగశాల. మనిషి తీసుకునే ఆహారం, ఔషధాల్లో విష పదార్థాలను తనలో దాచుకుని, శరీరానికి హాని జరగకుండా ఆరోగ్యాన్ని ప్రసాదించే అవయవం. ఇది పనిచేయడం మానేస్తే విష పదార్థాలు శరీరానికి చేరి.. మనిషి మరణం అంచుకు వెళ్లక తప్పదు. అందుకే కాలేయం.. జరభద్రంగా ఉండాలి.


ప్రభుత్వాస్పత్రిలో వైద్యం పొందుతున్న రోగులు (ఫైల్)

చిత్తూరు రూరల్: కాలేయ సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో రోజురోజుకు పెరుగుతోంది. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు కాలేయ రోగులు నిత్యం క్యూ కడుతున్నారు. వారిలో లివర్ సిర్రోసిస్ కేసులు కూడా ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఆహారపు అలవాట్లు కారణంగా ప్రతి వంద మందిలో 60 మందికి ఫాటీ లివర్ ఉంటుండగా, 15 శాతం మందిలో గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. లివర్ సిర్రోసిస్‌కు బాధితుల్లో ఆల్కహాల్ తాగేవారితోపాటు, ఆల్కహాల్ తాగని వారు సైతం ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రభుత్వాస్పత్రికి క్యూ...

లివర్ సమస్యలతో బాధపడుతున్న వారు జిల్లా ప్రభుత్వాస్పత్రికి క్యూ కడుతున్నారు. గ్యాస్ట్రో సమస్యలతో ఓపీకి రోజుకు 200 నుంచి 250 మంది వరకూ వస్తుంటారు. వారిలో అల్సర్లు, అరుగుదల ఇబ్బందులతో పాటు, లివర్ సమస్య ఉన్న వారు కూడా ఎక్కువగా ఉంటున్నారు. హెపటైటిస్ బీ, సీ కేసులు కూడా వస్తున్నాయి. నెలలో ఇద్దరు, ముగ్గురు లివర్ సిర్రోసిస్ కొత్త కేసులను చూస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఫాటీలివర్ కేసులు పదుల సంఖ్యలో ఉంటున్నాయని వారు చెబుతున్నారు. నాన్ ఆల్కహాలిక్స్‌లో ఫాటీలివర్ సిర్రోసిస్‌కు దారితీస్తే ప్రాణాంతకం కావచ్చు.

అప్రమత్తత అవసరం..

లివర్ సమస్యలు ఎక్కువగా మధుమేహ రోగులు, హైపోథైరాయిడ్ ఉన్న వారు, హెపటైటీస్ సి, రక్తంలో కొలస్ట్రాల్ స్థాయిలు అసాధారణంగా ఉన్న వారిలో వస్తున్నాయి. ఫాటీలివర్ సాధారణంగా భావించి, అశ్రద్ధ చేస్తుండడంతో అది కాస్త సిర్రోసిస్‌కు దారితీస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఫాటీ లివర్ గ్రేడ్ 1, గ్రేడ్ 2, గ్రేడ్ 3లో దుష్ఫలితాలు లేకుండా చూడవచ్చని, కానీ సిర్రోసిస్‌కు దారితీస్తే లివర్ గట్టిపడి వెనక్కి వచ్చే పరిస్థితి ఉండదని, లివర్ ఫంక్షన్‌లో తేడా వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆ పరిస్థితుల్లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం ఒక్కటే మార్గమని అంటున్నారు.

ముందు జాగ్రత్త మేలు...

శారీరక శ్రమలేని జీవన విధానానికి ప్రతి ఒక్కరూ అలవాటు పడ్డారు. దానికి తోడు ఫ్యాట్ ఎక్కువగా ఉన్న జంక్‌ఫుడ్ తింటున్నారు. దీంతో శరీరంలో కొలస్ట్రాల్ స్థాయి విపరీతంగా పెరిగి, లివర్‌పై ప్రభావం చూపుతోంది. 40 ఏళ్లు దాటిన వారు ఏటా లివర్ ఫంక్షన్ టెస్ట్, కొలెస్ట్రాల్ లెవల్స్, థైరాయిడ్, షుగర్ పరీక్షలతోపాటు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ కూడా చేయించుకుంటే మంచిది. ఇప్పుడు లివర్ పనితీరును కచ్చితంగా నిర్ధారించేందుకు ఫైబ్రో స్కాన్ అందుబాటులోకి వచ్చింది.

జిల్లా ప్రభుత్వాస్పత్రిలో కాలేయ వ్యాధి ఓపీ వివరాలు

నెల	సంఖ్య
జూలై	2,365
ఆగస్టు	2,056
సెప్టెంబర్	2,864
అక్టోబర్	2,455

ఆయా పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారించుకుని, ముందు జాగ్రత్తలు తీసుకుంటే మేలని వైద్యులు సూచిస్తున్నారు.

కారణాలివే...

- శ్రమ లేని జీవన విధానం
- ఆహారపు అలవాట్లు
- పెరుగుతున్న మధుమేహ వ్యాధి
- ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తినడం
- ఆల్కహాల్ వ్యసనం

అశ్రద్ధ చేస్తే..

శరీర అవయవాల్లో పునరుత్పత్తి అయ్యే ఒకే ఒక అవయవం కాలేయం. అందుకే వైద్యులు దీనిని ఫ్రెండ్లీ ఆర్గాన్ అని పిలుస్తారు. అటువంటి కాలేయాన్ని మనం ఒక మంచి స్నేహితుడిలా జాగ్రత్తగా చూసుకోవాలని, ఏం కాదులే అని అశ్రద్ధ చేస్తే ప్రాణానికే ప్రమాదం దాపురించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

లివర్ సమస్యలు పెరిగాయి



ఇటీవల కాలంలో కాలేయ సమస్యలతో వస్తున్న బాధివతులను ఎక్కువగా చూస్తున్నాం. ఒకప్పుడు ఆల్కహాల్ తాగే వారికి మాత్రమే లివర్ సిర్రోసిస్ వ్యాధి సోకేది. కానీ ఇప్పుడు కొలెస్ట్రాల్ కారణంగా నాన్ ఆల్కహాలిక్స్‌లో కూడా సిర్రోసిస్ చూస్తున్నాం. ప్రతిరోజూ వ్యాయామంతోపాటు, ఆహార నియమాలు పాటిస్తూ, శరీరంలో కొలెస్ట్రాల్ పెరగకుండా చూసుకోవాలి.

–డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వాస్పత్రి

చిత్తూరు టూటౌన్ సీఐగా ఉలసయ్య



చిత్తూరు అర్బన్: చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా ఉలసయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మద్దయ్య ఆచారి రాజంపేటకు బదిలీకాగా, ఆయన స్థానంలో వైఎస్సార్ కడప జిల్లాలో పనిచేస్తున్న ఉలసయ్యను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో చిత్తూరులో బాధ్యతలు తీసుకున్నారు.

నేడు ఓటరు నమోదుపై ర్యాలీ

చిత్తూరు అర్బన్: ఓటు హక్కు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించడంలో భాగంగా చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించడం కోసం వార్డు కార్యదర్శులు, నగరపాలక సంస్థ, మెప్మా ఉద్యోగులు శుక్రవారం ఉదయం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

తాడేపల్లెగూడెంలో రథం


కాణిపాక ప్రచార రథం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ప్రచార రథం గురువారం తాడేపల్లె పట్టణంలో పర్యటించింది. ఉదయం పట్టణంలో పర్యటించగా భక్తులు స్వామివారిని దర్శించుకుని కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రమేష్, అర్చక వేదపండితులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంలో యాజమాన్య పద్ధతులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రభాకర్

బంగారుపాళెం: గొర్రెల పెంపకంలో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభదాయకంగా ఉంటుందని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. బంగారుపాళెం ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో గురువారం రైతులకు గొర్రెలపెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, లాభదాయకమైన గొర్రెల పెంపకంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మందలో జాతిలక్షణాలు కలిగిన విత్తనపు పొట్టేలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కర్నూలు జిల్లా ప్యాపిలి గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, గొర్రెల్లో పారుడు వ్యాధి, గాలికుంటు వ్యాధి, చిటుక రోగము, బొబ్బవ్యాధి, నీలినాలుక, ఆంత్రాక్స్ బ్రూసెల్లోస్, వంటి వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్యాపిలి పశువైద్యశాల డాక్టర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ డైరెక్టర్ విజయమోహన్, పశువైద్యులు అమరనాథ్, మోహన్‌బాబు, గోపాలమిత్రలు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సెక్టోరల్ అధికారులకు శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పూతలపట్టు: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆర్డీఓ చిన్నయ్య ఆధ్వర్యంలో సెక్టోరల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి నియోజకవర్గంలోని 5 మండలాలకు సంబంధించిన 36 మంది సెక్టోరల్ అధికారులు హాజరయ్యారు. ఆర్డీఓ మాట్లాడుతూ 10 పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టోరల్ అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. సెక్టోరల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతో ఉందని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఇచ్చే ఆదేశాలను అనుసరించి విధులను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌ఓ శివయ్య, పూతలపట్టు, తవణంపల్లి తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

కామేశ్వరరావు సేవలు వెలకట్టలేనివి


నివాళి అర్పించిన ఈఈ పద్మనాభ పిళ్లై

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బలిదానం చేసుకున్న కామేశ్వరరావు సేవలు వెలకట్టలేనిదని ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. కామేశ్వరరావు 50వ వర్ధంతి సందర్భంగా గురువారం గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. డ్రాఫ్ట్‌మ్యాన్‌గా ఉన్న కామేశ్వరరావు విద్యుత్ ఉద్యోగ సంఘాన్ని స్థాపించి ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఈలు శేషాద్రిరెడ్డి, జ్ఞానేశ్వర్ నాయకులు యజ్ఞేశ్వరరావు, చంద్రమౌళి, గోవిందరాజులు, గోవిందన్, విద్యాసాగర్, చంద్రశేఖర్, గౌతమ్, బాబు, ఫైరోజ్, గజేంద్ర, రవి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో శుక్రవారం నుంచి సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తారన్నారు. లబ్ధిదారులు వలంటీర్లకు అందుబాటులో ఉండి పింఛన్ నగదును ఐదురోజుల్లోపు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం



తవణంపల్లె: పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రియాంక, గుడిపాల: వైద్య శిబిరంలో డాక్టర్ రక్షిత

తవణంపల్లె: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని ఎగువమారేడుపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక 62 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవం చేసుకోవడం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రక్షిత అన్నారు. చింతగుంటూరు గ్రామంలో గురువారం 58 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే వైద్యసేవలను అందించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, ప్రియాంక, యమున, సుజాత, కోకిల తదితరులు పాల్గొన్నారు.

మురిపించిన హరివిల్లు



పూతలపట్టు: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం నింగిలో ఇంద్రధనస్సు సాక్షాత్కరించింది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు మొదలయ్యాయి. జల్లులు ఆగిన వెంటనే నింగిలో ఈ హరివిల్లు ప్రత్యక్షమైంది. స్థానికులు ఈ దృశ్యాన్ని సెల్‌ఫోన్లలో బంధించి మురిసిపోయారు.

సంక్షేమ ప్రదాతను మరోసారి గెలిపించుకుందాం


గుడిపాల: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ఐరాల: అవినీతికి తావులేకుండా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందామని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పిలుపునిచ్చారు. మండలంలోని కాణిపాకం సచివాలయంలో గురవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకురావడంతో పాటు సంక్షేమ ఫలాలను అందరికీ అందజేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు ఏ మేలు కలిగిందో వివరించేందుకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ విశ్వనాథరెడ్డి, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ నాగరాజు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

బంగారుపాళెం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని గుంతూరు గ్రామ సచివాలయంలో గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగున్న రేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సీఎం చేసిన మేలును ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూరిన లబ్ధి వివరాల బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఉపసర్పంచ్ ఈశ్వర్, జెడ్పీటీసీ సోమశేఖర్, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ అహ్మద్, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, జిల్లా కార్యదర్శి రఘుపతిరాజు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సంక్షేమ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పూతలపట్టు: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని పి.కొత్తకోట సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును, జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షులు జయచంద్రారెడ్డి, నాయకులు రాజారత్నంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్ రెడ్డి, సర్పంచ్ పద్మజరాణి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ దేవిక, వైస్ఎంపీపీ ద్వారకనాథ రెడ్డి, ఎంపీటీసీ దేవిక, ఎంపీడీఓ గౌరి, నాయకులు అమర్నాథరెడ్డి, మండల యువత అధ్యక్షులు నవీన్‌రెడ్డి, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి జరీనా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గుడిపాల: ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పానాటూరు గ్రామ సచివాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగున్నరేళ్లల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సీఎం జగన్ చేసిన మేలును ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జనార్దన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మొగిలిరెడ్డి, రజిని, రజినీకాంత్, అన్బు, సామువేల్, యోవాన్, శిలంబరసన్, రవీంద్రారెడ్డి, గుండుసాయి, వెంకటేశులు రెడ్డి పాల్గొన్నారు.


తిరుగులేని పార్టీగా నిలబెట్టండి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద తెలిపారు. కొంగారెడ్డిపల్లె, మిట్టూరు–2 డివిజన్లలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత సచివాలయాల్లో సంక్షేమ పథకాల బోర్డును, కూడళ్లలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, టిమ్ము, నగర సచివాలయ కన్వీనర్లు రాంగణేష్, కిరణ్, కార్పొరేటర్ మురళీకృష్ణ, నాయకులు శిరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

తవణంపల్లె: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన చేస్తున్నారని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు హరిరెడ్డి అన్నారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును పార్టీ నాయకులు, అధికారులు ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. తర్వాత వలంటీర్లు, గృహసారథులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, సర్పంచ్ సూరి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


బంగారుపాళెం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఐరాల: బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తవణంపల్లె: కరపత్రాల పంపిణీ, చిత్తూరు: బోర్డును ఆవిష్కరిస్తున్న చిత్తూరు మేయర్ అముద, ఎమ్మెల్యే

నేడు క్రైస్తవుల జెండా ఆవిష్కరణ

చిత్తూరు రూరల్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు చిత్తూరు నగరం, మండలంలోని పలు చర్చిలు, శిలువ కొండల్లో శుక్రవారం జెండాను ఎగురవేయనున్నారు. ఏటా డిసెంబర్ నెల ప్రారంభం రోజు క్రైస్తవులు జెండా ఆవిష్కరణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ప్రత్యేక ఆరాధనలు, ప్రార్థనలు నిర్వహించనున్నారు. తర్వాత భజన, జెండాతో ఊరేగించనున్నారు. అనంతరం చర్చి, శిలువ కొండల్లో జెండా ఎగురవేస్తామని మత పెద్దలు పేర్కొన్నారు.

సారా నిర్మూలనకు కృషి


కార్డెన్ సెర్చ్‌లో అధికారులు

గుడిపాల: సారా నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దామని ఎస్‌ఈబీ ఈఎస్ బాబుశ్రీధర్ అన్నారు. మండలంలోని రాసనపల్లెలో గురువారం రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సారా నిర్మూలనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. ఎందుకు గ్రామస్తులు పూర్తిగా సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ జోగేంద్ర, అధికారులు ఊహశ్రీ, వెంకటలక్ష్మీ, మాధవస్వామి, బాబు, రాంప్రసాద్, మస్తాన్ పాల్గొన్నారు.

పౌష్టికాహార పంపిణీ తేదీల్లో మార్పులు

చిత్తూరు రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహార పంపిణీలో మార్పులు చోటుచేసుకున్నాయని సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి అన్నారు. చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లిలోని తన కార్యాలయంలో ఆమె గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల నుంచి రెండో శుక్రవారం 7 నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు బాలామృతం, పాలు, కోడిగుడ్లు ఇస్తారన్నారు. బాలింతలు, గర్భిణులకు బియ్యం, పప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు తదితరాలు పంపిణీ చేస్తామన్నారు. రెండో విడతగా నాలుగో శుక్రవారం పిల్లలకు పాలు కోడిగుడ్లు, తల్లులకు పౌష్టికాహార కిట్, కోడిగుడ్లు, పాలు అందజేస్తామన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించి సహకరించాలని ఆమె కోరారు.